



చింతకాని : నేరడలో బీఆర్ఎస్ జెండాలు కప్పుతున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# కమల్‌రాజు గెలుపు కాంక్షిస్తూ బీఆర్ఎస్ ప్రచారం





మధిర : వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, చింతకాని : ర్యాలీలో మాట్లాడుతున్న పెంట్యాల పుల్లయ్య

మధిర, నవంబర్28 : నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు గెలుపును కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు సాయినగర్‌లో మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత ఆధ్వర్యంలో, 14వ వార్డు వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేశారు. కారు గుర్తుపై ఓటు వేసి కమల్‌రాజును అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాఘవరావు, వెంకటేశ్వరరావు, కపిలవాయి జగన్మోహన్‌రావు, ఆవుల రామకృష్ణ, వంకాయలపాటి నాగేశ్వరరావు, భువనగిరి నారాయణరావు, మామిళ్లపల్లి సతీశ్, కాజా చక్రం, కృష్ణమూర్తి, కిలారు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని, నవంబర్ 28 : దళితబంధు లబ్ధిదారులంతా సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అన్నారు. ప్రొద్దుటూరు గ్రామంలో మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ గెలుపును కాంక్షిస్తూ గ్రామంలోని దళితకాలనీల్లో, గుర్రం రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి భారీ ర్యాలీలో ఆయన మాట్లాడారు. నాగులవంచ గ్రామంలో వంకాయలపాటి సత్యనారాయణ వీవీ ప్యాట్‌ల ద్వారా ప్రచారం నిర్వహించారు. నేరడ గ్రామంలో మంకెన రమేశ్, ఆలస్యం శంకర్, కొల్లి వెంకయ్య ఆధ్వర్యంలో పలు పార్టీల నుంచి 6 కుటుంబాల వారు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ ఆమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు, బూత్ కన్వీనర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో నాయకులు కురుగుంట్ల రవీందర్‌రెడ్డి, గురజాల హనుమంతరావు, బొడ్డు వెంకట్రామారావు, గడ్డం శ్రీనివాసరావు, తుడుం రాజేశ్, చాట్ల సురేశ్, కొల్లి వెంకయ్య, చెవుల వెంకటప్రసాద్, కోలేటి రాధాకృష్ణ, అంబటి వెంకటి, ముఖ్య కార్యకర్తలుపాల్గొన్నారు.

### ప్రచారంలో లింగాల తనయ అభిజ్ఞ

చింతకాని, నవంబర్ 28 : అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై నిత్యం పోరాడే మా నాన్న లింగాల కమల్‌రాజ్‌కు ఓటు వేయాలంటూ కమల్‌రాజు తనయ లింగాల అభిజ్ఞ ఓటర్లను అభ్యర్థించారు. చిన్నమండవ, సీతంపేట, నాగులవంచ తదితర గ్రామాల్లో తండ్రి గెలుపు కోసం మంగళవారం ఆమె విస్తృత ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అన్ని అంశాలను పల్లెల్లోని ఓటర్లకు వివరిస్తూ ఓట్లు వేయాలని కోరారు. ప్రచారంలో ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





నేరడలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, సీతంపేటలో కారు గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న లింగాల కూతురు అభిజ్ఞ

# కాంగ్రెస్ నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కొణిజర్ల, నవంబర్28 : మండల పరిధిలోని రామనర్సయ్యనగర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు పోట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి 150 కుటుంబాల వారు సోమవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పోట్ల శ్రీనివాసరావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తొలుత గ్రామంలో ప్రచారం నిర్వహించగా ఆయనకు మహిళలు హారతి ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిలారు మాధవరావు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

మామిళ్లగూడెం, నవంబర్ 28: జిల్లాలో శాసనసభ ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ బూత్‌లలో ఎన్నికల సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో గుర్తించిన 1456 పోలింగ్ కేంద్రాల నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని లైవ్‌లో పరిశీలించేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 390 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక అదనపు భద్రత ఏర్పాటు చేయనున్నారు. 526 పోలింగ్ కేంద్రాల బయట ప్రత్యేక సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఐదు నియోజక వర్గాల్లో 12 లక్షల 16 వేల 796 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లాలో ఉన్న 1456 పోలింగ్ కేంద్రాలకు 3790 బ్యాలెట్ యూనిట్లు, 1817 కంట్రోలింగ్ యూనిట్లు, 2035 వీవీ ప్యాట్స్ యంత్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. ఎన్నికల భద్రత చర్యలలో భాగంగా ఇప్పటికే పోలీస్ యంత్రాంగం 144 సెక్షన్ అమలు చేస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో బార్లు, వైన్ షాపులను ఎక్సైజ్ అధికారులు మూసి వేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే గ్రామాల్లో పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. కేంద్ర బలగాలతో, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికలకు భద్రత ఏర్పాట్లు చేశారు.

## సర్కారు దవాఖానలో ముగ్గులు, డ్రాయింగ్ పోటీలు

ఖమ్మం సిటీ, నవంబర్ 28: వరల్డ్ ఎయిడ్స్ డే (డిసెంబర్ 1)ను పురస్కరించుకొని మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని ఏఆర్‌టీ సెంటర్‌లో మందులు వాడుతున్న హెచ్ఐవీ బాధితులకు సంబంధిత అధికారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు డ్రాయింగ్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఏపీపీ పాజిటివ్ అసోసియేషన్ ఖమ్మం సహకారంతో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన వారికి డిసెంబర్ 1న ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్స్, ఆర్ఎంవో చేతుల మీదుగా బహుమతులందజేస్తారని తెలిపారు.

## 30లోగా కవితలు, కథలు పంపాలి

ఖమ్మం, నవంబర్ 28: రచయితలు ఈ నెల 30వ తేదీలోగా కవితలు, కథలు పంపాలని అంతర్జాతీయ తెలుగు మహాసభల నిర్వాహకుడు, గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రిలో జనవరి 5, 6, 7 తేదీల్లో జరిగే అంతర్జాతీయ తెలుగు మహాసభలను గేట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నామని, తెలుగు మహాసభల కవి సమ్మేళనంలో, కథల పఠనంలో పాల్గొనే రచయితలు తమ రచనలు పంపించాలని కోరారు. రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో జరిగే కవి సమ్మేళనంలో పాల్గొనేవారు డాక్టర్ ఎస్.ఆర్.ఎస్ కొల్లూరి 9247272066 ను సంప్రదించి రచయితలు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రచయితలకు ఏ తేదీన, ఎన్నిగంటలకు అవకాశం కల్పించబడిందో ఆ సమయంలో మాత్రమే కవి సమ్మేళనంలో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. కథా పఠనంలో పాల్గొనేవారు కొత్తగూడెం రాజేష్ 9989 723989 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలకు దేశ, విదేశాల నుంచి, తెలుగు రాష్ట్రాల నుంచి సాహితీవేత్తలు, ప్రముఖ అతిథులు, తెలుగు భాషా ప్రేమికులు పాల్గొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

## లారీ ఢీకొని వృద్ధుడు మృతి

అశ్వారావుపేట, నవంబర్ 28: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. స్థానిక నందమూరి నగర్‌కు చెందిన సోమలంక సత్యనారాయణ(60) బట్టల వ్యాపారి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో బట్టలు కొనుగోలు చేసి మంగళవారం వచ్చాడు. బట్టల మూటతో రోడ్డు పక్కన నిల్చున్నాడు. సత్తుపల్లి నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్నన్న బొగ్గు లారీ ఢీకొడంతో అతడు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి ఎస్సై శివరామకృష్ణ తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

అశ్వారావుపేట, నవంబర్ 28: కట్నం వేధింపులు భరించలేని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎటపాక మండలానికి చెందిన పొడియం వెంకయ్య కుమార్తె సునీత(23), అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామస్తుడు సున్నం శ్రీనును 2019లో ప్రేమ వివాహం చేసుకుంది. వారి సంసారం ఏడాది పాటు సాఫీగా సాగింది. ఆ తర్వాత నుంచి ఆమెను కట్నం కోసం భర్తతోపాటు అత్త దుర్గ, మామ రామయ్య వేధించసాగారు. ఇవి మరీ తీవ్రమవడంతో భరించలేక, సోమవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స జరుగుతుండగానే ఆమె మృతి చెందింది. సునీత తండ్రి పొడియం వెంకయ్య ఫిర్యాదుతో కట్నం వేధింపుల కేసు నమోదైంది. స్టేషన్ హౌజ్ ఆఫీసర్ శ్రీకాంత్ దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

## గాయత్రీ ఆలయంలో అఖండ జ్యోతి

దమ్మపేట, నవంబర్ 28: స్థానిక గాయత్రీ ఆశ్రమంలోని అరుణాచల మహదేవ్ మందిర్‌లో మంగళవారం మహా అఖండ జ్యోతి వెలిగింది. ఈ జ్యోతికి ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర మూర్తీజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ జ్యోతి విశిష్టతను భక్తులకు వివరించారు. ఆవు నెయ్యి ఇచ్చిన భక్తులకు ధన్యవాదాలు తెలిపారు.

